# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-08-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్ర వ్యాప్తంగా రేపు 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్నాయి.
- స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని కేంద్ర హోం శాఖ ఈరోజు గ్యాలంట్రీ అవార్డులను ప్రకటించింది.
- రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సులు నిర్వహించనుంది.
- “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమంలో భాగంగా ఈరోజు రాష్ట్రంలో పలు చోట్ల జాతీయ త్రివర్ణ పతాకంతో ర్యాలీలు నిర్వహించారు.
- మహిళల భద్రతకు పూర్తి చిత్తశుద్ధితో ప్రభుత్వం పని చేస్తోందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.

==========================

రాష్ట్రవ్యాప్తంగా రేపు భారతదేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొని ఉదయం 9 గంటలకు జాతీయ జెండాలను ఆవిష్కరించారనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపు ఉదయం 8 గంటలకు రాష్ట్ర అసెంబ్లీ భవనం వద్ద రాష్ట్ర శాసన మండలి అధ్యక్షులు కొయ్యే మోషేన్ రాజు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర శాసన సభ భవనంలో ఉదయం 8 గంటల 15 నిమిషాలకు రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. అలగే రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, సహకార శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. జిల్లా స్థాయి వేడుకల్లో మంత్రులు, కలెక్టర్లు, ప్రజా ప్రతినిధులు స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురష్కరించుకొని కేంద్ర హోం శాఖ ఈరోజు గ్యాలంట్రీ అవార్డులను ప్రకటించింది. దేశవ్యాప్తంగా పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డ్, సివిల్ డిఫెన్స్ సర్వీసులో పని చేసే 1,037 మంది అధికారులకు ఈ అవార్డులను ప్రధానం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి గ్యాలంటరీ మెడల్ కు ఇన్ స్పెక్టర్ షేక్ సర్దార్ ఘని, సబ్ ఇన్ స్పెక్టర్ సవ్వన అరుణ్ కుమార్, రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్ మైలాపల్లి వెంకట రామ పరదేశీ, హెడ్ కానిస్టేబుల్ రాజన గౌరీ శంకర్లు ఎంపికయ్యారు.

అలాగే ఇద్దరికి రాష్ట్రపతి పోలీస్ విశిష్ఠ సేవా పతకం, నలుగురికి పోలీస్ గ్యాలంటరీ పతకాలు, 19 మందికి విశిష్ఠ సేవా పతకాలు లభించాయి.

రాష్ట్రపతి విశిష్ట సేవా పురస్కారానికి.. ఐజీ మీసాల రవిప్రకాశ్, సబ్ ఇన్ స్పెక్టర్ దాసరి దండుగంగ రాజు ఎంపికయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు.  రెవెన్యూ యంత్రాంగం మొత్తం సిద్ధం కావాలని సంయుక్త కలెక్టర్ ఫర్మన్ అహమ్మద్ ఖాన్, పోలీసు సూపరింటెండెంట్ కె.వి మహేశ్వర రెడ్డితో కలసి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ముందస్తు ఏర్పాట్లపై సమావేశంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... 45 రోజుల పాటు రెవెన్యూ సదస్సుల నిర్వహణలో భాగంగా, ఏ గ్రామంలో సదస్సులు నిర్వహిస్తామనే అంశంపై ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా మ్యూటేషన్, వెబ్ ల్యాండ్ లో మార్పులు, 1బి, దారి సమస్య, భూ తగాదాలు ఎక్కువగా ఉంటాయని, ఇలాంటి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సదస్సులను నిర్వహిస్తుందని, 22 ఏ, ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి అన్ని విషయాలను పరిశీలించి ఇందుకు అవసరమైన రికార్డులను అధికారులు సిద్ధం చేయాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఈరోజు రాష్ట్రంలోని పలు చోట్ల త్రివర్ణ పతాకంతో  ర్యాలీలు నిర్వహించారు. “హర్ ఘర్ తిరంగా” కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐ టీ డి ఏ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు పాఠశాల విద్యార్థులు పట్టణంలో భారీ “హర్ ఘర్ తిరంగా” ర్యాలీ నిర్వహించారు. అలాగే మచిలీపట్నం కోనేరు సెంటర్ నందు కృష్ణా జిల్లా నెహ్రూ యువ కేంద్రం, చాంబర్ ఆఫ్ కామర్స్ వస్త్ర వ్యాపార అసోసియేషన్ ఆధ్వర్యంలో “హర్ ఘర్ తిరంగా” ర్యాలీ నిర్వహించారు. 300 మంది విద్యార్థులు 365 అడుగుల జాతీయ జెండాను చేతపట్టి స్వాతంత్ర ఉద్యమ ఘటనను గుర్తు చేస్తూ దేశ సమగ్రతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వందేమాతరం నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బంగ్లాదేశ్ సంక్షోభం నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితులు అదుపులో ఉన్నాయని నిఘా వ్యవస్థల నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. విశాఖలో ఈరోజు మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. కోల్ కతాలోని ట్రైనీ డాక్టర్ హత్యను ఖండించారు. రాష్ట్రంలో మహిళల భద్రతకు పూర్తి చిత్తశుద్ధితో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. అలాగే 2047 విజన్ డాక్యుమెంట్ పై కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని, ఆంధ్రప్రదేశ్ కు మంచి భవిష్యత్తును ఆకాంక్షిస్తూ... 78వ స్వాతంత్ర్య దినోత్సవంలోకి అడుగుపెడుతున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "జల్ జీవన్ మిషన్" ఎంతో దోహదం చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని ఆత్మకూరులో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన అనంతరం ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆత్మకూరులో 117 కోట్ల రూపాయలతో "జల్ జీవన్ మిషన్" పథకాన్ని అమలు చేస్తామన్నారు. ఈ పథకం వల్ల ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని సమస్యల పరిష్కారం కోసం అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించాలని మంత్రి ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ 78వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు ప్రణంగా పెట్టి, అహర్నిశలు పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులందరినీ స్మరించుకోవాలన్నారు. వారి త్యాగనిరతే మనం స్వాతంత్ర్య స్వేచ్ఛా ఫలాలను అనుభవించడానికి మార్గం సుగమం చేసిందంటూ గుర్తు చేశారు. ఇది సత్యం, అహింస, శాంతి, ఐకమత్యం, సర్వ మానవ సౌభ్రాతృత్వంతో విలసిల్లుతూ, ఉత్తేజంగా దేశ ప్రజలంతా పునరంకితం కావలసిన రోజు అని పేర్కొన్నారు. 2047లో స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాలు జరిగే నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చే దిశగా "వికసిత్ భారత్" స్ఫూర్తితో అడుగులు వేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. దేశ నిర్మాణానికి పునరంకితం అవుతామని ప్రతిజ్ఞ చేద్దామని గవర్నర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో  పార్వతీపురం మన్యం జిల్లాలో జాబ్ మేళాను ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి అధికారి ఆర్ వహీదా ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 17వ తేదీ ఉదయం 10 గంటల 30 నిమిషాల నుండి జాబ్ మేళా జరుగుతుందన్నారు. హెటెరో ల్యాబ్స్ లిమిటెడ్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీన్ లిమిటెడ్ కంపెనీల సౌజన్యంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ మేళాలలో 270 ఉద్యోగాలను భర్తీ చేయనున్నామని, 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి, డిగ్రీ అర్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తిగల యువత www.ncs.gov.in వెబ్ సైట్ లో నమోదు కావాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాంధ్ర ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరహాలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకం 35 సంవత్సరాలు పూర్తి చేసుకొని ఈరోజు 36వ వసంతంలోకి అడుగు పెట్టింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఈరోజు అన్నదానములో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =